క్లుప్తంగా

కేంద్రంపై ఒత్తిడి తేవాలి



మాట్లాడుతున్న రాంప్రభు

తిరుమలగిరి : బీసీ రిజర్వేషన్లపై అఖిలపక్షంగా ఏర్పడి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకరావాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు పేర్కొన్నారు. ఆదివారం ఆయన తిరుమలగిరిలో మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం నిర్వహించిన బంద్ విజయవంతమైనందున, బంద్‌కు సహకరించిన రాజకీయ పార్టీలకు, కుల సంఘాలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట వంగరి బ్రహ్మం, భిక్షం, సోమనారాయణ, యాదగిరి, సుధాకర్, రామ్మూర్తి, ఉపేందర్ గౌడ్, కృష్ణ, వెంకన్న ఉన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

సూర్యాపేట: ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర స్వామి ఆదేశాలతో దీపావళి పండుగను పురస్కరించుకుని సూర్యాపేట మండలం రత్నపురం, రామచంద్రపురం గ్రామాలలో త్రైత సిద్ధాంత భగవద్గీత, ఇతర ఆధ్యాత్మిక గ్రంథాలపై త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక తొర్రూరు కమిటీ సభ్యులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సుధాకర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక తొర్రూరు కమిటీ సభ్యులు గణేష్ శర్మ, అశోక్, మధు, యాకన్న, శ్రీను, దశరథ, మని, సిద్ధూ, రాణి, నాగమణి, సమత, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పనులు ప్రారంభం



తిమ్మాపురంలో పనులను ప్రారంభిస్తున్న దేవస్థాన మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి

అర్వపల్లి : మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆదివారం కాంగ్రెస్ జిల్లా నాయకుడు, అర్వపల్లి దేవస్థాన మాజీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే సామేల్ సహకారంతో గ్రామంలో రూ.3.50 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు గుడిపల్లి మధుకర్‌రెడ్డి, వేల్పుల రమేష్, మాజీ సర్పంచ్‌లు జీడి వీరస్వామి, పాలెల్లి సురేష్, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం చేస్తున్న మిత్రులు

తుంగతుర్తి : మండల పరిధిలోని వెంపటి గ్రామానికి చెందిన నిరుపేద షేక్ పాషాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా ఇంటి నిర్మాణానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో 2008–09 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన అతడి స్నేహితులు ఆదివారం అతడికి రూ.15000 ఆర్థికసాయం అందజేశారు. సహాయం అందజేసిన వారిలో మిరియాల యాకేష్, గిలకత్తుల మహేష్, పసుపులేటి వెంకన్న, చిటుపాక శ్రీను, సందీప్, మహేష్ ఉన్నారు.

నేడు వాలీబాల్ పోటీలు

నడిగూడెం : దీపావళి పండుగను పురస్కరించుకొని మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు ఎలుగూరి సతీశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలుగూరి వెంకటేశ్వర్లు యువసేన ఆధ్వర్యంలో నిర్వహించే పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.5వేలు, రెండో బహుమతిగా రూ.3వేలు, మూడో బహుమతిగా రూ.2వేలు అందిస్తామని పేర్కొన్నారు.

నిధులు లేక.. వసతులు సమకూరక!

- రైతువేదికలకు కొన్నేళ్లుగా రాని నిర్వహణ నిధులు
- సమస్యలు తీర్చాలని కోరుతున్న రైతులు

అర్వపల్లి : రైతులకు ఎప్పటికప్పుడు తగిన సూచనలు, సలహాలివ్వడం, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడం, కాలానుగుణంగా పంటల సాగుపై దిశానిర్దేశం చేయడం కోసం గత ప్రభుత్వ హయాంలో 2021లో క్లస్టర్‌కు ఒకటి చొప్పున రైతు వేదికలను ఏర్పాటుచేశారు. ఒక్కో వేదికను రూ.22లక్షలతో నిర్మించారు. ఏఈఓలు ఈ వేదికలలో విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే వీటి నిర్వహణకు నెలకు రూ.10వేల చొప్పున చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించగా.. కొన్ని నెలల వరకు నిధులు మంజూరు చేశారు. ఆ తర్వాత నిర్వహణ నిధుల విడుదల నిలిచిపోయింది. దీంతో పాటు రైతువేదికలకు ఎలాంటి మరమ్మతులు లేకపోవడంతో ఎక్కడికక్కడ శిథిలమవుతున్నాయి. జాజిరెడ్డిగూడెం మండలంలోని తిమ్మాపురం, రామన్నగూడెంలలో రెండు రైతువేదికలను ఏర్పాటు చేశారు.



తిమ్మాపురంలోని రైతువేదిక

కొరవడిన కనీస వసతులు..

తిమ్మాపురం, రామన్నగూడెం రైతువేదికలలో కనీస వసతులు కొరవడ్డాయి. నీటి వసతి కూడా లేదు. మరుగుదొడ్లు పనిచేయక మూలన పడ్డాయి. వేదికలు రేకులతో నిర్మించడంతో అవి దెబ్బతిని వర్షానికి కారుతున్నాయి. కిటికీలకు తలుపులు లేక దుమ్ము, దూళితో నిండుతోంది. వర్షపు నీరు వేదికల లోపలికి వస్తోంది. దీంతో సిబ్బంది విధులకు ఆటంకం ఏర్పడుతోంది. అలాగే విద్యుత్ బిల్లులు కూడా ప్రభుత్వం నుంచి కొంత కాలంగా రావడంలేదు. వేదికల అడుగు భాగంలో వేసిన టైల్స్ ఊడిపోతున్నాయి. దీంతో రైతులు, వ్యవసాయ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. కాగా ఈ వేదికలను వీసీ సెంటర్లుగా ఏర్పాటు చేయడంతో ప్రతి మంగళవారం రైతులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. కనీస వసతులు లేకపోవడంతో రైతులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతువేదికలలో కనీస వసతులు కల్పించి, నెలనెలా నిర్వహణ నిధులను విడుదల చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

కనీస వసతులు లేవు



తిమ్మాపురంలోని రైతువేదికలో కనీస సౌకర్యాలు లేవు. నీళ్ల లేక ఇబ్బందులు అవుతున్నాయి. మరుగుదొడ్లు పనిచేయడంలేదు. నిధులు లేకపోవడంతో నిర్వహణ సరిగా లేక రైతులు వేదికలు శిథిలావస్థకు చేరుతున్నాయి. ప్రభుత్వం స్పందించి ప్రతి నెలా నిధులు విడుదల చేసి వసతులు కల్పించాలి.

– బంటు యాదగిరి, రైతు

అధ్వానంగా చిన్న నీటి వనరులు



చెట్లపొదలతో నిండిన అర్వపల్లిలోని కుంట కట్ట



అడివెంల శివారులోని చెరువు కట్ట

- కంపచెట్లతో నిండిన చెరువుల కట్టలు
- ఎనిమిదేళ్లుగా కొరవడిన నిర్వహణ
- మరమ్మతులు చేయించాలని రైతుల వేడుకోలు

అర్వపల్లి : చిన్ననీటి వనరులు నిర్వహణ లేక అధ్వానంగా మారుతున్నాయి. గత ఎనిమిది సంవత్సరాలుగా ఎలాంటి మరమ్మతులు లేకపోవడంతో చెరువులు, కుంటల కట్టలు కంపచెట్లు, పిచ్చిమొక్కలతో నిండిపోయి రాకపోకలకు కూడా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. తూములు కూడా కొన్ని చోట్ల పాడయ్యాయి. ప్రభుత్వం వీటి నిర్వహణకు నిధులు మంజూరు చేయక పోవడంతో మరమ్మతులకు నోచుకోవడం లేదు.

జాజిరెడ్డిగూడెం మండలంలో 81 చెరువులు, కుంటలు..

జాజిరెడ్డిగూడెం మండలంలో 5 చెరువులు, 76 కుంటలు ఉన్నాయి. వీటి కింద సుమారు 5వేల ఎకరాల ఆయకట్టు ఉంది. మిషన్ కాకతీయ పథకంలో గత ప్రభుత్వ హయాం నందు 2017 వరకు చెరువులు, కుంటల మరమ్మతు జరిగింది. మళ్లీ అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టక పోవడంతో అధ్వానంగా మారాయి. చెరువులు, కుంటల కట్టలు కంపచెట్లు, పిచ్చి మొక్కలతో నిండాయి. రైతులు తమ పొలాల వద్దకు ఈ కట్టల పైనుంచి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా చిన్ననీటి వనరులపై ప్రభుత్వం దృష్టి సారించి మరమ్మతులు చేసి కట్టలను పటిష్టపర్చాలని రైతులు కోరుతున్నారు.

అధ్వానంగా తయారయ్యాయి



చెరువులు, కట్టలు కొన్నేళ్లుగా మరమ్మతుకు నోచుకోవడం లేదు. నిర్వహణ నిధులు లేక అధ్వానంగా మారాయి. ప్రతి ఏటా వీటి నిర్వహణకు నిధులు మంజూరు కావాల్సి ఉంది. కానీ మంజూరు చేయడంలేదు.

– వజ్జె శ్రీనివాస్, సీపీఎం మండల కార్యదర్శి

ప్రతిపాదనలు పంపాం



జాజిరెడ్డిగూడెం మండలంలో 81 చెరువులు, కుంటలు ఉన్నాయి. కట్టలపై కంపచెట్లు పెరిగాయి. వీటి మరమ్మతుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు చేయిస్తాం.

– హరిస్వరూప్, నీటిపారుదలశాఖ ఏఈ

సూర్యక్షేత్రంలో సౌరహోమం, పూజలు



సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు



పూజలు చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ వేణారెడ్డి

అర్వపల్లి : తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని చాయాసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. అనంతరం యజ్ఞశాలలో మహాసౌర హోమం నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకులు కాకులారపు రజితజనార్దన్, గణపురం నరేష్, యాదగిరి, బెలిదె లక్ష్మయ్య, అర్చకులు భీంపాండే, అంకిత్‌పాండే పాల్గొన్నారు.

పలువురు నాయకుల పూజలు..

తిమ్మాపురంలోని సూర్యక్షేత్రాన్ని ఆదివారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు బీరవోలు వీరారెడ్డి, బైరబోయిన రామలింగయ్య, ఇంద్రారెడ్డి, గిరి, నాయకులు, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు

అర్వపల్లి : లోయపల్లి, చాకలిగూడెం గ్రామాల్లో ఆదివారం పశు వైద్యశిబిరం నిర్వహించారు. 200 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. పశువులు వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండటానికి టీకాలను వేయించాలని పశువైద్య సిబ్బంది కోరారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి బి.అర్జున్, వీఎల్‌ఓ కేఎస్ఎస్ పద్మ, సిబ్బంది మధుసూదన్, యాకయ్య, ఆల్డాస్ లింగయ్య, ఎస్.అర్జున్, రైతులు పాల్గొన్నారు.

బొౖర సైదులుకు నివాళి

అర్వపల్లి : తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు బొౖర వెంకన్న తండ్రి, జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బొౖర సైదులు సంతాప సమావేశాన్ని ఆదివారం కోడూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సామ అభిషేక్‌రెడ్డి, దేశగాని పాపయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ రషీద్, గుయ్యని బాబు, చెంచల శ్రీనివాస్, సంగు జానయ్య, తదితరులు ఉన్నారు.

కారు, బైక్ ఢీ.. నలుగురికి గాయాలు

పెన్‌పహాడ్ : అతివేగంగా వస్తున్న కారు అదుపు తప్పి బైక్‌ను ఢీకొట్టడంతో భార్యభర్తలతో పాటు ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని పొట్లపహాడ్ గ్రామ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండలం బద్యతండా గ్రామానికి చెందిన బానోతు రమేష్ దీపావళి పండుగ కోసం భార్య ఇద్దరు పిల్లలతో కలిసి బైక్‌పై మిర్యాలగూడెం పట్టణానికి వెళ్తుండగా మార్గమధ్యలో పొట్లపహాడ్ గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న ఇన్నోవా కారు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో రమేష్‌తోపాటు అతడి భార్య సుందరి, కుమార్తె కావ్యశ్రీతో పాటు మరో కుమార్తెకు కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. రమేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయమై ఎస్ఐ గోపికృష్ణను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

బైక్‌పై నుంచి పడి మహిళకు తీవ్ర గాయాలు

తుంగతుర్తి: రోడ్డుకు అడ్డంగా మేకలు అడ్డురావడంతో బైక్‌పై నుంచి పడి మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం తుంగతుర్తి మండల కేంద్రంలో జరిగింది. వివరాలు.. తుంగతుర్తి మండలం వెంపటి గ్రామానికి చెందిన కొండగడుపుల పరుశరాం, సునీత దంపతులు ఆదివారం బైక్‌పై మద్దిరాలకు వెళ్తున్నారు. మార్గమధ్యలో తుంగతుర్తి మండల కేంద్రానికి చేరుకోగానే మెయిన్ రోడ్డు వెంట ఉన్న వ్యాపారస్తులు మేకలను వెళ్లగొట్టగా.. మేకలు బైక్‌కు తగలడంతో బైక్‌పై కూర్చున్న సునీత కిందపడి తీవ్రంగా గాయపడింది. ఆమెను వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



సూర్యాపేట : సోలిపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కొప్పుల వేణారెడ్డి



ఆత్మకూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కొణతం సత్యనారాయణరెడ్డి



అర్వపల్లి : బొల్లంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ శ్రీకాంత్

సూర్యాపేట : సూర్యాపేట మండలంలోని సోలిపేట గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సన్నాలు పండిస్తున్న రైతులను ప్రోత్సహించడానికి క్వింటాకు రూ.500 బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని, మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బీరవోలు రవీందర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బీరవోలు వీరారెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజద్ అలీ, పీసీసీ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్, మాజీ జెడ్పీటీసీ చింతమళ్ల రమేష్, మాజీ వైస్ ఎంపీపీ రామసాని శ్రీనివాస్, దండు మైసమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, నాయకులు పందిరి మల్లేష్ గౌడ్, గోగిరెడ్డి వెంకటరెడ్డి, చెరుకు వెంకన్న, కందుల అశోక్ రెడ్డి, కుశలవ రెడ్డి, గొల్ల రమేష్, చందా గోపాల్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఆరబెట్టిన ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని పీఏసీఎస్ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సంఘం సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు మడ్డి రమేష్, గంగారెడ్డి, గోపగాని మల్లయ్య, భద్రాచారి, సీఈఓ లక్ష్మారెడ్డి, ఏఈఓ పవన్ తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : మండలంలోని బొల్లంపల్లి గ్రామంలో ఆదివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ బాషపాక శ్రీకాంత్ ప్రారంభించారు. రైతులు ఈ కేంద్రంలో ధాన్యాన్ని అమ్ముకొని మద్దతు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్ జలేంధర్‌రావు, సెంటర్ ఇన్‌చార్జ్ కేసగాని మహేశ్వర్, రైతులు పందిరి సురేందర్, చిరంజీవి, మురళి, రవీందర్, కార్తీక్, నర్సయ్య, శేఖర్, అంజయ్య, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణ



తిరుమలగిరిలో జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కొత్తగట్టు మల్లయ్య

తిరుమలగిరి : బహుజన రాజ్యాధికార స్ఫూర్తి ప్రదాత మహాత్మా జ్యోతిరావు పూలే నూతన విగ్రహాన్ని సామాజిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కొత్తగట్టు మల్లయ్య ఆదివారం తిరుమలగిరి ఎక్స్ రోడ్డులో ఆవిష్కరించారు. తిరుమలగిరి ఎక్స్ రోడ్డులో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహం గతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ ఢీకొట్టడంతో ధ్వంసమయింది. ఈ సందర్భంగా నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగట్టు లలిత, కడెం మల్లయ్య, చేను శ్రీనివాస్, కందుకూరి ప్రవీణ్, ఉదయ్, రాంప్రభు, కొమ్మినేని సతీష్, ఎల్సోజు నరేష్, పులిమామిడి సోమయ్య, భిక్షం, వెంకన్న, యాదగిరి, మురళి, చంద్రమౌళి, బ్రహ్మం, యాకూబ్, దీన్‌దయాళ్, షకీల్, యాదగిరి, లక్ష్మయ్య, దేవా, దానయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి



మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చామంతి

తిరుమలగిరి : సీసీఐ కొనుగోలు కేంద్రంలో పత్తి పంటను అమ్ముకునే రైతులు ముందుగా వ్యవసాయ అధికారుల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఎల్సోజు చామంతి నరేష్ కోరారు. ఆదివారం మార్కెట్ కార్యాలయంలో మాట్లాడారు. రైతులు తమ స్మార్ట్ ఫోన్లలో కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చూసుకుంటే అందుబాటులో ఉన్న జిన్నింగ్ మిల్లులో పంటను అమ్ముకునే అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులు తమ పరిధిలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లో సంప్రదించి స్లాట్ బుక్ చేసుకోవాలని కోరారు. రైతులు సమీపంలోని జిన్నింగ్ మిల్లులలో సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా పత్తి పంటను విక్రయించాలని తెలిపారు. ఈ సమావేశంలో మార్కెట్ డైరెక్టర్‌లు రాపాక సోమేశ్, అంగోతు రాములు, దొడ్డ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతులు సెల్ నంబర్‌ను నమోదు చేసుకోవాలి

అర్వపల్లి : పత్తి సాగుచేసిన రైతులు తమ సెల్ నంబర్‌ను ఏఈఓల వద్ద నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి.గణేష్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. సెల్‌నంబర్‌ను నమోదు చేసుకున్న రైతులు పత్తిని అమ్మే సమయంలో కపాస్ కిసాన్ యాప్‌లో తమ సెల్ నంబర్ సహాయంతో లాగిన్ అయి స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. దీంతో పత్తిని సీసీఐ కేంద్రానికి ఏ రోజు తీసుకెళ్లాలో యాప్ ద్వారా వివరాలు సెల్‌కు వస్తాయని తెలిపారు.

కార్టూనిస్ట్ రాజును ఆదుకుంటాం

మునగాల : మునగాల మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన కార్టూనిస్ట్ సరికొండ రాజును అన్ని విధాలుగా ఆదుకుంటామని మేడ్చల్ డీసీపీ నంద్యాల కోటిరెడ్డి అన్నారు. పది సంవత్సరాలుగా పక్షవాతంతో బాధపడుతున్న రాజును ఆదివారం కోటిరెడ్డి పరామర్శించారు. గతంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉత్తమ కార్టూనిస్టుగా రాజు పలు అవార్డులు అందుకున్నాడని తెలిపారు. తల్లిదండ్రులు లేని రాజును ఇన్ని రోజులు పిన్నమ్మ ఆదుకుందని, ఇటీవల అనారోగ్యంతో ఆమె మృతి చెందినట్లు చెప్పారు. ఈ కష్ట సమయంలో రాజును ఆదుకునేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. డీసీపీ వెంట కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు నాగిరెడ్డి విజయమ్మ, గ్రామస్తులు సరికొండ హనుమంతరాజు, పందిరి బ్రహ్మారెడ్డి, నాగిరెడ్డి, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకే..



కాంగ్రెస్ బాకీ కార్డులు పంచుతున్న నాయకులు

తుంగతుర్తి : అబద్ధపు హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కి తెలంగాణ ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ వెలుగుపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు మల్లెపాక రాములు అన్నారు. బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పార్టీ కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డులను పంపిణీ చేసి మాట్లాడారు. గడిచిన 22 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ ఎంపీటీసీ మట్టపల్లి కవిత, నాయకులు గుడిపాటి వీరయ్య, యాకోబు, సోమేష్, పరమేష్, పాలబిందెల మల్లయ్య, లింగయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నియామకపత్రాలు అందుకున్న సర్వేయర్లు



నియామకపత్రాలతో సర్వేయర్లు

నాగారం : హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ఆదివారం జరిగిన లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో నాగారం మండలానికి చెందిన సర్వేయర్లు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాలను అందుకున్నారు. నియామకపత్రాలు తీసుకున్నవారిలో నాగారం మండల నుంచి చిప్పలపల్లి నాగార్జున, దేశగాని భరత్, వేల్పుల వినయ్, చిప్పలపల్లి దివ్య, విష్ణు, దాస్యం సంధ్య ఉన్నారు. వారికి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

రోడ్డు బాగుచేయాలని మహిళల ఆందోళన



రాస్తారోకో చేస్తున్న మహిళలు

మఠంపల్లి : మట్టపల్లి–హుజూర్‌నగర్ ప్రధాన రహదారి చౌటపల్లి వద్ద పూర్తిగా ధ్వంసమైంది. ఈ రోడ్డును బాగు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామ మహిళలు ఆదివారం రోడ్డుపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రోడ్డు ధ్వంసమవడంతో వాహనాలు వెళ్లేటప్పుడు దుమ్ము లేచి తమ ఇండ్లలోకి వస్తుందని, తాము అనారోగ్యం బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల రాస్తారోకోతో రోడ్డుకు ఇరువైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచి పోయాయి. విషయం తెలుసుకున్న మఠంపల్లి ఎస్ఐ పెదపంగ బాబు అక్కడికి చేరుకుని ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. రోడ్డు బాగుచేయకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని మహిళలు హెచ్చరించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న మాజీ సర్పంచ్ రాయిరాల శోభారాణిసోమయ్య

పెన్‌పహాడ్ : మండలంలోని చెట్లముకుందాపురం గ్రామంలో శ్రీ దుర్గామాత ఆలయ నిర్మాణం కోసం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రాయిరాల శోభారాణిసోమయ్య దంపతులు రూ.100116 విరాళం ప్రకటించారు. ఆ నగదును ఆదివారం దేవాలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.